20 టీంల ఏర్పాటు

● వీడనున్న బి.మఠం భూమాఫియా గుట్టు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(కడప-ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠంలో జరిగిన భూ కబ్జాల గుట్టు రట్టుకానుంది. వైసీపీ హయాంలో నకిలీ డీపట్టాలు సృష్టించడం, వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా ఎంట్రీలు చేయడం, ప్రభుత్వ భూములు ఆక్రమించడం ఇష్టారాజ్యంగా జరిగింది. ఆ భూ ఆక్రమణల గుట్టును రట్టు చేసేందుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ 20 టీంలను ఏర్పాటు చేశారు. కుడా సెక్రటరీ జె.శిరీషాను ప్రత్యేకాధి కారిగా నియమించారు. బి.మఠం మండలంలో జరిగిన భూ ఆక్రమణలపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో పాటు పీజీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. భూ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పరిధిలో 493.33 ఎకరాలు, పలుగురాళ్లపల్లెలో 88.88, పాపిరెడ్డిపల్లెలో 180.71, ఇటుకులపాడులో 23.3, దిగువ నేలటూరులో 1468.29, బి.అగ్రహారంలో 408.18, డి.నరసింహాపురంలో 44.53, దిరసవంచలో 704.23, ఎగువనేల టూరులో 445.96, నాగిశెట్టిపల్లెలో 325.68, రేకులకుంటలో 662.94 ఎకరాలు.. మొత్తం 4846.03 ఎకరాలు కబ్జాకు గురయ్యాయని సర్వేనెంబర్లతో సహా ఫిర్యాదులు అందాయి. ఈ భూములగుట్టు రట్టు చేసేందుకు మొత్తం 20 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంకు వీఆర్వో, విలేజీ సర్వెంట్, డిప్యూటీ తహశీల్దారు ఉంటారు. మఠంలో సిబ్బంది తక్కువగా ఉండడంతో బద్వేలు, మైదుకూరు, గోపవరం, బి.కోడూరు మండలాల నుంచి సిబ్బందిని తీసుకువచ్చి విచారణ అధికారులుగా నియమించారు. ఈ టీంలు క్షేత్రస్థాయికి వెళ్లి భూముల్లో సాగులో ఎవరున్నారు. ఒరిజనల్‌గా పట్టాలు ఎప్పుడు ఇచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో ఎవరున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించారా, ప్రభుత్వ అటవీశాఖ భూములతో పాటు వాగులు వంకలు ఆక్రమణ చేశారా.. అనేవి పరిశీలించనున్నారు. నెలరోజుల్లోపు ఎంక్వయిరీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయవత్తిడి లేకుండా నిక్కచ్చిగా విచారణ జరిగితే బ్రహ్మంగారి మఠంలో భూమాఫియా ఆగడాలు సంచలనంగా మారనున్నాయి.

స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద అమలవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు వేగవంతంగా పూర్తిచేసి డిసెంబరు నాటికి అన్నీ అందుబాటులోకి తేవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో, సీకేదిన్నెలో స్మార్ట్‌కిచెన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. ఇవి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టగా.. 23 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 10 స్మార్ట్ కిచెన్ల నిర్మాణం కూడా వేగవంతం చేయాలన్నారు. కంకర, ఇసుక ఇతర సమస్యలుంటే పరిష్కరించాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఆహారం అందిస్తున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యత విషయమై విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కూరగాయలు కొనుగోలుకు డీఆర్డీఏ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో హజరత్తయ్య, డీఈవో షంషుద్దీన్, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైవీయూకు వెంకయ్యనాయుడు రాక

కడప ఎడ్యుకేషన్ / క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శనివారం మధ్యాహ్నం 3.30గంటలకు యోగివేమన విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారని వీసీ బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. సెనెట్ హాల్లో విద్యార్థులతో ప్రత్యేకంగా సంభాషిస్తార న్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. కాగా.. ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో జరిగే బ్రౌన్ శాస్త్రి శతజయంతి వేడుకల్లో వెంకయ్యనాయుడు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, నగరంలోని సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

18 మందికి పదోన్నతులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయంలో శుక్రవారం ఆర్జేడీ సురేశ్‌కుమార్ అధ్యక్షతన జోన్-4కు సంబంధించి జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 మందికి పదోన్నతులు కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ ఫోర్ పరిధిలో ఉమ్మడి జిల్లాలకు సంబంధించి కడప జిల్లాలో ముగ్గురు, చిత్తూరు ఐదుగురు, అనంతపురం నలుగురు, కర్నూలు ఆరుగురికి పదోన్నతులు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కడప డీవీఈఓ వెంకటేశ్వర్లు, తిరుపతి రాజశేఖర్‌రెడ్డి, సత్యసాయి జిల్లా చెన్నకేశవ ప్రసాద్, కడప ఆర్జేడీ కార్యాలయం ఏఓ రూపానాయక్ పాల్గొన్నారు.

మనోజ్‌రెడ్డి..?

- ● కమిషనర్‌గా వచ్చిన ఏడాదిలోనే.. కడప కార్పొరేషన్‌లో తనదైన ముద్ర
- ● అవినీతి అధికారులపై సస్పెన్షన్ వేటు
- ● ప్రధాన డ్రైనేజీల మెరుగుకు చర్యలు
- ● ఆయనను సాగనంపే యత్నం



కడప నగరపాలక సంస్థ కార్యాలయము

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థ కమిషనర్ నిమ్మనపల్లె మనోజ్‌రెడ్డిని ఇక్కడ నుంచి సాగనంపే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్లు కార్పొరేషన్ సర్కిల్‌లో ప్రచారం జరుగుతోంది. ఈయన స్థానంలో మెప్మా పీడీగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను కమిషనర్‌గా నియమించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. దీనివెనకున్న వారు అనుకున్నట్లు జరిగితే నవంబరు రెండో వారంలోపు మనోజ్‌రెడ్డిని బదిలీ చేస్తారని చెబుతున్నారు. మనోజ్‌రెడ్డి గత ఏడాది సెప్టెంబరులో కడప కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. వచ్చిన ఏడాదిలోనే తనదైన ముద్ర చూపించారు. కార్పొరేషన్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అవినీతి అధికారులపై వేటువేసి సంచలనం సృష్టించారు. ఎన్నికల హామీల్లో భాగంగా చెత్తపన్నును ప్రభుత్వం రద్దు చేసింది. అయితే కొంత మంది రెగ్యులర్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిపి చెత్తపన్ను వసూలు చేసి జేబులు నింపుకునేవారు. దీనిపై ఫిర్యాదు రావడంతో కమిషనర్ మనోజ్‌రెడ్డి 18 మందిపై వేటు వేశారు. రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేయగా.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఉద్యోగం నుంచి తొలగించారు. ఇది అప్పట్లో సంచలనం రేపింది. సచివాలయ ఉద్యోగులు వేళాపాళా లేకుండా విధులకు హాజరయ్యేవారు. వారిపై కూడా చర్యలు తీసుకున్నారు. టౌన్‌ప్లానింగ్‌లో ఓ అధికారిపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో ఆయనను జనాలతో సంబంధం లేకుండా కేవలం ఆఫీసు పనులకే పరిమితం చేశారు. సాయిచంద్ ప్రవీణ్ బదిలీ అయ్యాక కార్పొరేషన్ గాడి తప్పింది. అవినీతి అధికారులపై వేటువేసి కార్పొరేషన్‌ను మనోజ్‌రెడ్డి గాడిలో పెడుతున్నారు.

అధికారపార్టీకి అనుకూలంగా ఉన్నా..

కార్పొరేషన్‌లో వైసీపీ పాలకవర్గం ఉంది. వారు ఎంత వత్తిడి చేసినా కడప ఎమ్మెల్యే ఆర్.మాధవికి కమిషనర్ మనోజ్‌రెడ్డి మద్దతుగా నిలుస్తూ వచ్చారు. కడప ఎమ్మెల్యే, మాజీ మేయర్ మధ్య జరిగిన కుర్చీల కొట్లాటలో మనోజ్‌రెడ్డి ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరించారు. పాలకవర్గం ఎంత టార్గెట్ చేసినా, జనరల్ బాడీ మీటింగ్‌లో వేదికపై మేయరు పక్కన ఎమ్మెల్యేకోసం కుర్చీ ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో ఉద్యోగులను గాడిలో పెట్టడంతో పాటు అధికారపార్టీకి అనుకూలంగా పనిచేసినా మనోజ్‌రెడ్డిని సాగనంపేందుకు సర్వం సిద్ధమైందని సమాచారం.

కమిషనర్‌గా మెప్మా పీడీ కిరణ్‌కుమార్?

మెప్మా పీడీగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ కడప కార్పొరేషన్ కమిషనర్‌గా రానున్నట్లు చెబుతున్నారు. ఈయన నియామకం దాదాపు ఖరారైనట్లేనని చర్చ నడుస్తోంది. కిరణ్‌కుమార్ తిరుపతిలో పనిచేస్తున్నప్పుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మంచి ఫాలోయర్ అని ప్రచారం ఉంది. ఇందులో భాగంగా 2024 ఎన్నికల్లో గూడూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వైసీపీలో టికెట్ కోసం ప్రయత్నం చేశారని అటు వైసీపీ వర్గాల్లో ఇటు కార్పొరేషన్ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఇలాంటి నేపథ్యంలో జగన్ సొంత జిల్లా అయిన కడప కార్పొరేషన్ కమినర్‌గా కిరణ్‌కుమార్ వస్తారనే వార్త పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోలార్ రూఫ్ టాప్‌ను బలవంతంగా ఎవరికీ కట్టబెట్టవద్దని ప్రభుత్వం చెప్పినప్పటికీ కడపలో మాత్రం సూర్యఘర్ కోసం డ్వాక్రా ఆర్పీలకు టార్గెట్ పెట్టారు. ఒక్కొక్కరికి వంద కనెక్షన్లు చేయాలంటూ చేయాలంటూ హుకుం జారీ చేశారు. ఇదంతా ఈయన ఆధ్వర్యంలోనే జరిగింది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఇటువంటి వ్యక్తి కడప కార్పొరేషన్ కమిషనర్‌గా రానుండటంపై చర్చ నడుస్తోంది.

కార్పొరేషన్‌ను గాడిలో పెట్టారు

ఇక అసంపూర్తిగా నిలిచిన డ్రైనేజీ పనులు, ప్రధానకాల్వ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు, కోర్టు, అంబేడ్కర్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే డ్రైనేజీ పూర్తి చేయడంతో వర్షాకాలంలో ఇక్కడ నీటి ముప్పు తప్పింది. మొత్తానికి తొలినాళ్లల్లో స్పీడు రానప్పటికీ తరువాత పట్టు సాధించి కార్పొరేషన్‌ను గాడిలో పెట్టారు.

కుందూలో తగ్గుతున్న వరద



టంగుటూరు వద్ద కుందూలో తగ్గుతున్న వరద నీరు

రాజుపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుపాను ధాటికి ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూలో వరద ప్రవాహం శుక్రవారానికి తగ్గుముఖం పట్టింది. దీంతో కుందూకు ఇరుపక్కలా ఉన్న పంటలు నీటిలోంచి బయటపడుతున్నాయి. కుందూకు నీళ్ల తగ్గడతో రైతన్నలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కుందూకు ఇరువైనులా పంట పొలాలు, విద్యుత్‌మోటార్లు, స్టార్టర్లు నీట మునగడంతో తాము నష్టపోయామని రైతులు పేర్కొన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా.. కుందూ పరీవాహక ప్రాంతంలో నీట మునిగి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలిస్తున్నారు.

బ్రహ్మంగారి గృహాన్ని పరిశీలించిన నిపుణులు



బ్రహ్మంగారి గృహాన్ని పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గృహం ఇటీవల తుపాను కారణంగా పాక్షికంగా కూలిపోయిన సంగతి తెలిసిందే. దీనిని శుక్రవారం ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిలర్ మెంబరు లయన్ చిన్నపరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గౌరీశంకర్, దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ త్వరలోనే ఢిల్లీ నుంచి ప్రధాన టీం వస్తుందని, తర్వాత కలెక్టరుకు నివేదిక అందిస్తామని తెలిపారు.

పోలీసుల క్యాండిల్ ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశభద్రత, సమాజ రక్షణ కోసం అసువులుబాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కొనియాడారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ వద్ద క్యాండిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదిరోజులుగా పోలీసు అమరవీరుల సంస్మరణలో భాగంగా ఓపెన్‌హౌస్, బ్లడ్ డొనేషన్ క్యాంపు, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం క్యాండిల్ ర్యాలీ నగరంలో పలు చోట్ల నిర్వహించి పోలీసు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంది.

సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించండి

● రైతులకు విన్నవించిన ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీలో ఎకోరన్ సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించాలని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం పాపిరెడ్డిపల్లె ప్రజలతో ఆర్డీవో చంద్రమోహన్ సమావేశమై మాట్లాడుతూ మొత్తం సోలార్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి 304 ఎకరాలు నిర్ణయించామన్నారు. 176 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. మిగిలిన 128 ఎకరాల్లో పలుగురాళ్లపల్లె ప్రజలది 100 ఎకరాలు, పాపిరెడ్డిపల్లెలో 28 ఎకరాలు అవసరం అన్నారు. రైతులు తమకిష్టమైతే సంవత్సరానికి ఎకరాకు 30వేల చొప్పున ప్రభుత్వం లీజు ఇస్తుందని ఆర్డీవో అన్నారు. తాము మాట్లాడుకుని నిర్ణయం చెబుతామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కార్తీక్, డీటీ జాన్సన్, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సర్పంచ్ మార్తమ్మ సోలార్ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

రెవెన్యూలో భూచోళ్లు

- ● అనామత్ పట్టా భూములు హాంఫట్
- ● కోట్లాది రూపాయల భూములు బినామీల పాలు
- ● ఆర్ఓఆర్ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నవైనం
- ● రెవెన్యూకే మాయని మచ్చగా కొందరు తహశీల్దార్లు



కడప, కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూలో కొందరు భూచోళ్ల అవినీతి భూహక్కుదారుల పాలిట శాపంగా మారింది. తాతల కాలం నుంచి హక్కుగా వచ్చిన పట్టా భూములను టార్గెట్ చేశారు. వ్యవసాయం చేయలేకనో, లేక బతుకుదెరువు కోసం ఇతర దేశాలకు, ప్రాంతాలకు వెళ్లిన వారి భూరికార్డులను కొందరు తహశీల్దార్లు పక్కా స్కెచ్‌తో గల్లంతు చేశారు. ఏళ్లతరబడి భూములను ఆన్‌లైన్ చేసుకోని (అనామత్) భూములను వైసీపీ పాలనలో కొందరు తహశీల్దార్లు ఇష్టానుసారం పంపిణీ చేశారు. కొందరు తహశీల్దార్లు ఇతరులకు ఆన్‌లైన్ చేసే విషయంలో భూమిలో 30-40శాతం వాటా రూపంలో కోట్లాది రూపాయలు కొల్లగొట్టారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే కొందరి వ్యవహారం బట్టబయలయింది. ఇలాంటి వ్యవహారాలన్నీ సీకేదిన్నె, బద్వేలు, కడప, వల్లూరు, పెండ్లిమర్రి, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, జమ్మలమడుగు, పోరుమామిళ్ల మండలాల్లో ఎక్కువగా ఉన్నాయి. మిగతా మండలాల్లో కూడా ఇలాంటి వ్యవహారాలు చోటుచేసుకున్నాయి.

ఫిర్యాదుల వెల్లువ

ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ ప్రక్షాళనకు దిగారు. నిజమైన రైతులకు భూ సమస్యల విషయంలో నష్టం జరగకుండా వారం వారం కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయంగా ఆదేశాలు జారీచేస్తున్నారు. జిల్లాలో కొందరు తహశీల్దార్ల నిర్వాకంతో పట్టా భూములు కోల్పోయిన బాధిత రైతులు మండల, డివిజన్ల స్థాయిలో న్యాయం జరగడం లేదంటూ కలెక్టర్ నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వందల సంఖ్యలో ఫిర్యాదులతో వస్తున్నారు. అలాగే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సమస్యలను పరిష్కరించే విషయంలో వారం వారం రెవెన్యూ కోర్టుల్లో, కలెక్టర్ ప్రత్యేక పీజీఆర్ఎస్‌లు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అనామత్ భూముల అడ్రస్సు గల్లంతు

నగర కార్పొరేషన్ పరిధిలో గూడూరు పొలంలో తల్లి వై.వెంకటసుబ్బమ్మ నుంచి కుమారుడైన యేర్వా రామమూర్తికి 1.07 ఎకరాల పట్టా భూమి సంక్రమించింది. ఆ భూమికి సంబంధించి 60 ఏళ్ల కిందట నుంచి పక్కాగా తోక పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, రికార్డులు ఉన్నాయి. ఆ పొలం కౌలుకి ఇవ్వడంతో పంటలో ఏటా కొంత ఫలితం దక్కేది. అయితే ఆ భూమి నగరంలో ఉండడంతో ఆక్రమణదారుల కన్నుపడింది. గతంలో పనిచేసిన తహశీల్దారు తన అనుయాయుల పేరుతో ఆన్‌లైన్ చేసి రైతుకు అన్యాయం చేశారు. ఇలానే పెండ్లిమర్రి మండలంలో రైతు గోపాలరెడ్డికి చెందిన 7 ఎకరాలు వేరేవారిపేరుతో ఆన్‌లైన్ చేసేశారు. ఇలాంటివి కడపలో అయితే లెక్కలేనన్ని ఉన్నాయి. సీకేదిన్నె, బద్వేలులో పట్టా, అసైన్డ్ భూములు వేరేవారి పేర్లతో ఆన్‌లైన్ చేసి రెవెన్యూలో గందరగోళం సృష్టించారు. దీంతో బాధితులు అధికారులు, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి అక్రమాలు బయటి వ్యక్తులు చేస్తే పీడీ యాక్టులు, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టే ఈ శాఖ పెద్దలు.. అవినీతి అధికారుల చిట్టాలు చేతుల్లో ఉన్నా నాన్చుడు ధోరణి ప్రదర్శించడంపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఓఆర్ చట్టం అపహాస్యం

రెవెన్యూలో అత్యంత ముఖ్యమైన చట్టాల్లో ఆర్ఓఆర్ (రికార్డు ఆఫ్ రైట్స్) చట్టం ఒకటి. 1971లో వచ్చిన ఆర్ఓఆర్ యాక్టు భూ యాజమాన్య హక్కులపై సమగ్ర వివరాలకు సంబంధించి సెక్షన్ల వారీగా పొందుపరిచారు. తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఈ చట్టాలకు లోబడే రెవెన్యూ రికార్డులను చక్కదిద్దాల్సి ఉంటుంది. కానీ అవినీతికి అలవాటు పడిన కొందరు రెవెన్యూ అధికారులు ఈ చట్టాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించడంతో భూ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఆర్ఓఆర్ యాక్టు ప్రకారం భూ హక్కుదారుని గుర్తించడం, ఆన్‌లైన్, సర్వే నెంబరు వివరాలు రికార్డుల్లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు తహశీల్దార్లు ఇవేవీ పట్టించుకోకుండా పట్టా, ప్రభుత్వ భూములను అడ్డగోలుగా ఆన్‌లైన్ చేస్తున్నా ఉన్నతాధికారుల చర్యలు శూన్యం. దీంతో పట్టాదారులు ఇబ్బందుల్లో పడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

జిరాయితీ పట్టా భూములను ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేయడం చట్టవిరుద్ధం. అలాంటి బాధితులు తమ భూహక్కు పత్రాలతో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తాం. పట్టా భూములను సరైన పత్రాలు లేకుండా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించడం, ఆన్‌లైన్ చేసి ఉంటే.. అలాంటి అధికారులను వదిలి పెట్టేది లేదు. పారదర్శకంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం.

- విశ్వేశ్వరనాయుడు, డీఆర్వో

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విద్యార్థి ఎంపిక

వేంపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థిని తలారి ధానుశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు మన్యం జిల్లా పార్వతీపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొననుందని ఆ స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు.


విద్యార్థినిని అభినందిస్తున్న చైతన్యహైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి



పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : బీటెక్ రవి

పులివెందుల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీకి ఎప్పుడు ఎన్నికలు వచ్చిన గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని రాజారెడ్డి కాలనీలో ఎం.భాస్కర్, సాయినాథ్ ఆధ్వర్యంలో 80 మంది వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరికి బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, లింగాల మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

శనగ విత్తనాల నాణ్యతను రైతులు పరిశీలించుకోవాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ విత్తనాలు తీసుకెళ్లే రైతులు అక్కడే విత్తనాల నాణ్యతను పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నచెప్పలిలో శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ యార్డుచైర్మన్ రాఘవరెడ్డితోకలిసి పరిశీలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న చంద్రానాయక్

పెండ్లిమర్రి.: మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రాన్ని శుక్రవారం జేడీఏ చంద్రానాయక్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1247 క్వింటాళ్ల శనగ విత్తనాలకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటికి 554.4 క్వింటాళ్ల శనగలను రైతులకు సరఫరా చేశామన్నారు. ఇందులో పెండ్లిమర్రి,రంపతాడు రైతుసేవా కేంద్రాలలో విత్తనాల నాణ్యత సరిగా లేదని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. బాగా లేని విత్తనాలు తెచ్చిఇస్తే మరలా మంచి విత్తనాలు తెప్పించి ఇస్తామని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

భరత మాత ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి : డీఆర్వో

కడప కలెక్టరేట్,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భరత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే ఏక్తాదివస్ ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పటేల్ 150వజయంతిని నిర్వహించారు. అనంతరం అందరిచేత దేశ ఐక్యత, సమగ్రత,భద్రతకు పాటు పడతామని డిఆర్వో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ముందుగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి,స్టెప్ సీఈవో విజయకుమార్, మెప్మాపీడీ కిరణ్‌కుమార్,కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్లు,ఇతర అధికారులు,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'త్వరలో కాలేటి వాగు డ్యామ్‌కు హంద్రీనీవా నీరు'

చక్రాయపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె గ్రామం తక్కలపల్లె వద్ద నిర్మించిన కాలేటి వాగు డ్యామ్‌కు తలుపుల మీద పోయే హంద్రీనీవా నీరు త్వరలో రానున్నట్లు కాలేటివాగు చైర్మన్ లోమడ రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, హెచ్ఎల్‌సీ చైర్మన్ జోగిరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమావేశమై హంద్రీనీవా ద్వారా నీరువిడుదల చేయాలని నిశ్చయించినట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. రూ.5600కోట్లతో వైసీపీ హయాంలో చేపట్టిన ప్రాజెక్టు పనులకు కేవలం నీరు వెలిగల్లుకు వచ్చేటట్లు చేస్తున్నారని తెలిపారు. జనవరికి మండలంలోని దాదాపు రెండు వేల ఎకరాలు పంట పొలాలకు నీరందే అవకాశం ఉందన్నారు. ఏదిఏమైన త్వరలో హంద్రీనీవా ద్వారా నీరు వెలిగల్లుకు రానున్నట్లు ప్రకటించారు.

ప్రైవేటు బస్సులు తనిఖీ



సీకేదిన్నె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదం నేపథ్యంలో జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్నట్లు డీటీసీ వీర్రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బస్సుల్లో సీట్ ఆల్టర్నేషన్, ఫైర్ డిటెక్షన్ అలారం, అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలు, ఎమర్జెన్సీ డోర్ పనితీరు క్షుణ్ణంగా తమ సిబ్బంది పరిశీలిస్తున్నారన్నారు. ఏడు రోజుల నుంచి 102 ప్రైవేటు బస్సులను పరిశీలించి అందులో 59 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

'మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించద్దు'

వేంపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీఓ 590ని ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన సంతకాల సేకరణలో తులసిరెడ్డి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి,మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి,నాయకులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గౌరీదేవి కార్తీక మహోత్సవాలు

వేంపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంఘం వీధిలో వెలసిన గౌరీదేవి కార్తీక వేడుకలు నవంబరు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు బలిజసంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమికి ముందు జరిగే ఈ వేడుకల్లో భాగంగా గౌరీదేవి అమ్మవారిని ఐదు రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేస్తారు. ప్రతిరోజు రాత్రి గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పాలక మండలి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

లలితాంబకు ప్రత్యేక పూజలు

చెన్నూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : కార్తీక దశమి సందర్భంగా శుక్రవారం చెన్నూరులో ఉన్న నాగేశ్వర సమేత లలితాంబదేవికి ప్రత్యేక పూజలు చేశారు మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నాగశ్వరునికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం అల్పాహారం వితరణ చేశారు.

హెచ్ఆర్ఏను పెంచాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏఐసీటీఈ స్కేల్ పరిధిలోని అధ్యాపకులకు, యూజీసీ పరిధిలోని అధ్యాపకులకు, యూజీసీ పరిధిలోని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు హెచ్ఆర్ఏ పెంచాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. హెచ్ఆర్ఏను పది శాతానికి పెంచాల్సిందిగా కోరారు.



























జగనన్న మార్ట్‌కు వసూళ్లు

● 1344 డ్వాక్రా సంఘాల నుంచి రూ.20.16లక్షల సేకరణ ● ఏడాది తర్వాత రూ.6.72లక్షలు తిరిగి చెల్లింపు ● రూ.13లక్షలపై విచారణ కమిటీలు ● తేలని వ్యవహారం

పులివెందులలో జగనన్న మార్ట్ పేరుతో డ్వాక్రా సంఘాలలో ఒక్కొక్క సంఘం నుంచి రూ.1500 చొప్పున రూ.20.16లక్షలు వసూలు చేశారు. మూడేళ్లపాటు ఈ మార్ట్‌లో వ్యాపారాలు సాగించారు. డ్వాక్రా సంఘాలకు ఏడాదిలో ఒక్కొక్క సంఘానికి రూ.500 వెనక్కి తిరిగి చెల్లింపులు సాగినా పూర్తిమొత్తం ఎవరి దగ్గరుందో అంతుబట్టడం లేదు. ఇప్పటికే రెండు కమిటీలు విచారణ చేపట్టినా తేలలేదు.





పులివెందులలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ (జగనన్న మార్ట్)

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో దాదాపు 1344 గ్రూపులు ఉన్నాయి. 2021లో ఉన్న ఈ గ్రూపుల్లోని సభ్యులను వ్యాపార భాగస్వామ్యులను చేస్తూ జగనన్న మార్ట్ పేరుతో ఓ సూపర్‌మార్కెట్ ఏర్పాటు చేశారు. అందులో లాభమైనా, నష్టమైనా అందరికీ చెందాల్సిందే. ఇది ఒకరకంగా మహిళలకు ఆర్థిక భరోసాగా నిలిచే కార్యక్రమమైనా కొందరి అవినీతి ఆలోచనలతో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఈ మార్ట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను నెలనెలా ఈ గ్రూపుల్లోని సభ్యులే కొనుగోలు చేస్తుండేవారు. ధరల్లో వ్యత్యాసాలు ఉన్నాయని అప్పట్లో పలువురు మహిళలు ప్రశ్నించారు. అయితే ఆర్పీలు, మెప్మా సిబ్బంది ఇందులో వచ్చే లాభాలు మీకే వస్తాయి కదా అని వారిని ఏమార్చి వస్తువులను కట్టబెట్టేవారు. ఏడాది అనంతరం 1344గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.500 వెనక్కి ఇచ్చేశారు. అంటే దాదాపు రూ.6.72లక్షలు చెల్లించారు. అయితే మిగిలిన రూ.13.44లక్షలు ఏమైపోయాయో ఎవరికీ అంతుబట్టడం లేదు.

కొనుగోళ్లు-విక్రయాలు

పెద్దఎత్తున కొనుగోలు చేస్తే డీలర్ వద్ద ఎమ్మార్పీ కంటే తక్కువగానే ఉంటుంది. అయితే జగనన్న మార్ట్‌లో ఎమ్మార్పీ కంటే దాదాపు రూ.5 నుంచి రూ.10 ఎక్కువగా విక్రయాలు జరిపినట్లు పలువురు డ్వాక్రామహిళలు చెబుతున్నారు. ఈ లెక్కన ఎంత ఆదాయం వస్తుందంటే.. ఉదాహరణకు 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు డీలర్ వద్ద కొంటే ఒక్కో ప్యాకెట్ ధర రూ.130లు (ఎమ్మార్పీ రూ.150) అనుకుంటే రూ.13000పెట్టుబడి పెట్టినట్లు లెక్క. కానీ జగనన్న మార్ట్‌లో విక్రయించిన ధర రూ.160. అంటే 100 సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు విక్రయిస్తే రూ.16000 వస్తుంది. ఇందులో ఆదాయం రూ.3000. రవాణా చార్జీలు రూ.200 తీసేసినా రూ.2800 మిగులుతుంది. ఇలాంటి వ్యాపారం దాదాపు మూడేళ్లు సాగింది. కాగా ఇలాంటి నిత్యావసర వస్తువులు ఎన్ని ఉంటాయో అందరికి తెలిసిన విషయమే. వీటన్నిపైనా రూ.5 నుంచి రూ.10 ఎక్కువకు కొనుగోలు చేస్తే ఎంత మొత్తం అవుతుందనేది ఊహకందనిది.

అవినీతి పాత్ర ఆర్పీలదే..

డ్వాక్రా మహిళలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆర్పీ పాత్ర ఎక్కువగా ఉందని పలువురు డ్వాక్రామహిళలే బహిరంగంగా చెబుతున్నారు. వ్యాపారంలో భాగస్వామ్యులు కావాలని, మనకు తక్కువకే సరుకులు దొరుకుతాయని నమ్మబలికి ఒక్కొక్కరిచే రూ.150 గ్రూపు అంతా కలిసి రూ.1500 కట్టించుకున్నారు. పులివెందుల మెప్మాలో దాదాపు 44 మంది ఆర్పీలు ఉన్నారు. వీరంతా వారివారి గ్రూపుల వారితో రూ.1500 చొప్పున కట్టించి జగనన్న మార్ట్‌కు చెల్లించారు. ఇలా దాదాపు రూ.20.16లక్షలు జగనన్న మార్ట్ కోసం వసూళ్లు చేశారు. ఇప్పటి వరకు ఒక్కో గ్రూపునకు రూ.500 అంటే రూ.6.72లక్షలు చెల్లించారు. మిగిలిన డబ్బు ఏమైందంటే ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ మహిళలను మభ్యపెట్టారు. మొత్తానికి మార్ట్ మూతపడేలా చేసేశారు. పెట్టుబడి డబ్బు కూడా పూర్తిగా రాకపోవడంతో మహిళలు లబోదిబోమంటున్నారు. ఈ అవినీతిలో ఆర్పీలే ఎక్కువగా దోచుకున్నారని పలువురు మహిళలు బహిరంగంగానే చెబుతున్నారు. రూ.13.44 లక్షలు ఏమైపోయాయో అంతుపట్టని ప్రశ్నగా మిగిలిందని ఆరోపిస్తున్నారు.

మరో కమిటీని నియమిస్తాం..

జగనన్న మార్ట్‌లో జరిగిన అవినీతిపై మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరింది. ఇందుకు ఆయన స్పందిస్తూ రెండు కమిటీల ద్వారా విచారణ జరగలేదు. మరోమారు కమిటీని నియమించేందుకు సిద్ధమవుతున్నామని, త్వరలో నిజానిజాలు వెలికితీస్తామని ఆయన వివరించారు.

విచారణ శూన్యం

జగనన్న మార్ట్‌లో అవినీతి జరిగిందనే విషయం బయటకు పొక్కింది. దీంతో జగనన్న మార్ట్‌ను మూసేసి విచారణ చేస్తామని మెప్మా జిల్లా స్థాయి అధికారులు ప్రకటించారు. మొదటిసారి వేసిన కమిటీ చేతులెత్తేసింది. రెండోసారి వేసిన కమిటీ కూడా చేతులెత్తేసి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే విచారణ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే వారికి రాజకీయ ఒత్తిళ్లు, లేదంటే వచ్చే రుణాన్ని ఆలస్యం చేయడం వంటి ఇబ్బందులకు ఆర్పీలు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోటో ఏర్పాటు చేసి మహిళా మార్ట్ అని బోర్డు ఏర్పాటు చేశారు. కానీ అందులోని అవినీతిని వెలికి తీయలేకపోవడం స్పష్టమవుతోంది.

తమ పేర్లు చెప్పాడని జూనియర్‌పై సీనియర్ల దాడి

● కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
● ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు
● ఆలస్యంగా వెలుగులోకి

పులివెందుల రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో బీడీలు, సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి.. ఇవి ఎలా వచ్చాయని స్థానిక ప్రజలు హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని అడిగారు. దీంతో ఆ విద్యార్థి వాటిని పీల్చే అలవాటు ఉన్న విద్యార్థుల పేర్లు చెప్పడంతో స్థానికులు హాస్టల్ వార్డన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వారి ముందే సదరు విద్యార్థులను వార్డన్ మందలించాడు. దీనిని మనసులో పెట్టుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంటర్ విద్యార్థిపై దాడికి దిగారు. ఐదురోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు, విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని గాయత్రీనగర్ కాలనీలో ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు వసతి పొందుతున్నారు. కాగా ఐదురోజుల కిందట ఇంటర్ విద్యార్థిపై డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దాడి చేసి గాయపరిచారన్నారు. దాడి చేసినవారు చెడు అలవాట్లు ఉన్న విద్యార్థులే అని తెలిసింది. దాడి అనంతరం గాయపడిన విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ ఇలాంటివి జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గాయపడిన విద్యార్థిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే దాడి చేసిన విద్యార్థులు హాస్టల్‌కు రాలేదని తెలిసింది. విద్యార్థులు ఇష్టానుసారం ఎప్పుడు పడితే అప్పుడు వస్తుంటారని, ఒక్కోసారి గట్టిగా అరుస్తుంటారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరిని హాస్టల్ వార్డన్‌పై ఇష్టానుసారం వదిలేశాడని చెబుతున్నారు. దీనిపై హాస్టల్ వార్డన్ మోహన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా యవ్వనంలో ఇవన్నీ మామూలేనని, అయినా విద్యార్థికి రక్తం ఏమైనా వచ్చిందా అని ఎదురు ప్రశ్నించారు.

బీసీడబ్ల్యూవో ఏమన్నారంటే...

కళాశాల హాస్టల్‌లో జరిగిన దాడి విషయమై పులివెందుల బీసీడబ్ల్యూవో జ్యోతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా దాడి విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఫిర్యాదు అందితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

గండికోట నుంచి 5000 క్యూసెక్కులు విడుదల

కొండాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శుక్రవారం రాత్రి నుంచి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 4700 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 500 క్యూసెక్కులు, చిత్రావతి నది ద్వారా 200 క్యూసెక్కులు, వరద నీరు మరో 100 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.62 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాలో 70వేల క్యూసెక్కుల వరదనీరు

చెన్నూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చెన్నూరు వద్ద పెన్నానదిలో 70వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుంది. నదిలో నీరు ఉధృతంగా ఉండడంతో ఎవరూ నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, కార్తీక స్నానాల కోసం నదిలో దిగవద్దని తహసీల్దారు హెచ్చరించారు. అలాగే పెన్నానది తీరం వెంబడి నిత్యం వీఆర్వోలు, వీఆర్‌ఏలు కాపలాగా ఉండాలని అన్నారు.

విచారణ లేకుండా చర్యలు ఎలా తీసుకుంటారు

● ఇంటర్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట సీనియర్ అసిస్టెంట్ నిరసన

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన ఆరోపణలపై ఎటువంటి విచారణ చేయకుండా చర్యలు ఎలా తీసుకుంటారని తిరుపతి డీవీఈవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మునిచంద్ర తెలిపారు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఆర్జేడీ కార్యాలయం ఎదుట ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై డీవీఈవో పలుమార్లు ఫిర్యాదు చేశారని, అయితే ఎటువంటి విచారణ చేయకుండా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారన్నారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని హెచ్చరించారు. దీనిపై ఆర్జేడీ సురేష్‌బాబును వివరణ కోరగా మునిచంద్రపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి కమిషనర్‌కు పంపించడం జరిగిందన్నారు. అయితే కమిషనర్ ఆదేశాల మేరకే బదిలీ చేయడం జరిగిందన్నారు.

బాలుర ఆట స్థలంలో కిచెన్ షెడ్ నిర్మించవద్దు

● డీఈవో, డ్వామా పీడీ కమిటీకి స్థానికుల అభ్యంతరం



ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న డీఈవో, పీడీ బృందం

వేంపల్లె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలానికి మంజూరైన సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్‌ను జిల్లా పరిషత్ బాలుర ఆటస్థలంలో నిర్మించవద్దని పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు డీఈవో షంషుద్దీన్, డ్వామా పీడీ విజయకుమార్ బృందానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చుట్టుపక్కల విద్యార్థులకు, పిల్లలకు ఆటస్థలం లేకుండా పోతుందని, కిచెన్ షెడ్ నిర్మాణాన్ని ఇతర ప్రాంతాలకు మార్చాలని విన్నవించారు. శుక్రవారం డీఈవో షంషుద్దీన్, పీడీ విజయ్‌కుమార్, ఎంఈవో స్టాలిన్, పంచాయతీరాజ్ డీఈ సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు బాలుర ఆటస్థలాన్ని సందర్శించారు. అక్షయపాత్ర ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కిచెన్ షెడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తుండగా పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు, స్థానిక ప్రజలకు వ్యాయామానికి ఉపయోగపడుతోందని, కిచెన్ షెడ్ నిర్మాణంతో రాబోవు రోజుల్లో ఇబ్బంది వస్తుందని, తాళ్లపల్లె, లేదా పాములూరు హైస్కూలులో ఏర్పాటుచేస్తే అనువుగా ఉందని వివరించారు. ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌కు విన్నవించినట్లు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో, పీడీ తెలిపారు.

పుష్పగిరి ఆసుపత్రికి యూసీఐఎల్ వితరణ



చెక్కును అందజేస్తున్న యూసీఐఎల్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) తమ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్ (పీవీఆర్‌ఐ)కు రూ.24.20లక్షలను అందజేసింది. ఈ మేరకు యూసీఐఎల్ జీఎం (మిల్) సుమన్ సర్కార్ శుక్రవారం పుష్పగిరి ఆసుపత్రి హెడ్ సూర్యప్రకాష్‌కు అందజేశారు. ఈ నిధులతో వైద్య పరికరాలు కొనుగోలు చేసి ప్రతి సంవత్సరం 5000 కంటే ఎక్కువ ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయనున్నట్లు పుష్పగిరి సంస్థ తెలిపింది. కార్యక్రమంలో డీజీఎం (పర్చేజ్) ఎస్‌కే బర్మన్, సీఎస్‌ఆర్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

పంచాయతీలకు స్టాంపు డ్యూటీ ఫీజులు చెల్లించడం లేదు

● మంత్రి పయ్యావులకు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వినతి

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని పంచాయతీలకు రిజిస్ట్రేషను డిపార్టుమెంటు నుంచి స్టాంపుడ్యూటీ ఫీజులు చెల్లించడం లేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివచంద్రారెడ్డి విన్నవించారు. శుక్రవారం మంత్రి కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి మూడు నెలలకు రావాల్సిన స్టాంపు డ్యూటీ సెప్టెంబరు 2023 నుంచి పంచాయతీలకు చెల్లించలేదని వివరించారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న శివచంద్రారెడ్డి

హౌస్ బిల్డింగ్ సొసైటీలో అవినీతిపై విచారణ

ప్రొద్దుటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హౌస్ బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతిపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆమేరకు జిల్లా సహకార శాఖ అధికారులు వైఎంఆర్‌కాలనీలోని హౌస్‌బిల్డింగ్ సొసైటీ కార్యాలయంలో గత నెలలో రికార్డులు తనిఖీ చేశారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు మేరకు సహకార శాఖ అధికారులు విచారణ మొదలు పెట్టారు.హౌస్ బిల్డింగ్ సొసైటీ 1987లో థర్డ్ కాలనీ గా టూటౌన్‌బైపాస్ రోడ్డులో 460 ప్లాట్లు వేసి సొసైటీ సభ్యులకు కేటాయించారు.గతంలో వీటిని కంతుల వంతున సొసైటీనుండి కొనుగోలు చేశారు.వీటని రిజిష్టర్ చేయించుకోలేదు.నేడు ఆ స్థలాలకు భారీగా ధర పలుకుతుండటంతో వాటిని తమ పేరున తమ వారసుల పేరున రిజిష్టర్ చేయించుకుంటున్నారు. ఈ సొసైటీలో సభ్యులుగా వున్న వారికి సొసైటీకి ఎలాంటి డబ్బులు బాకీ లేమని ఎన్‌వోసీ ఇవ్వడానికి హౌస్ బిల్డింగ్ సొసైటీ పెద్దలు అధికారులు కలిసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యా దులు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సొసైటీ సభ్యులు కొందరు నాలుగు ప్లాట్లు ఇటీవల రిజిష్టర్ చేయించుకున్నారు. కానీ ఆ రిజిష్టర్‌చేయించుకుంది హౌస్‌బిల్డింగ్ సొసైటీ చైర్మన్ దార్శల భాస్కర్‌రెడ్డి బినామీలతో చేయించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల మేరకు సహకార శాఖ అధికారి రామక్రిష్ణ విచారించినట్లుసమాచారం. దీనిపై ఇన్‌చార్జ్ కార్యదర్శి విష్ణువర్ధన్ వివరణ కోరగా నాలుగు ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదు చేశారని ఆ ఆమేరకు సెప్టెంబరు నెలలో విచారణ జరిగిందని కానీ ఎటువంటి అక్రమాలు జరగలేదని తెలిపారు.



దొంగ అరెస్టు

● బంగారు సరుడు, రెండు మోటారు బైకులు స్వాధీనం

పోరుమామిళ్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పరారీలో ఉన్న ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దర్శనాల ఏడుకొండలును అరెస్టు చేసి అతని నుంచి 35 గ్రాముల బంగారు సరుడు, గ్లామర్ హీరో, పల్సర్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమాచారం మేరకు శుక్రవారం మల్లకతవ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటరు బైకులో గిద్దలూరు వైపు వెళుతున్న ఏడుకొండలును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. బంగారు తాళిబొట్టు సరుడు సుమారు 35 గ్రాములు, రెండు మోటారుబైకులను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు వారు తెలిపారు.

సేవాశ్రమం సేవలు అభినందనీయం

కాశినాయన, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలో అనాథలు, వృద్ధులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్ అన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న వయోవృద్ధుల సంక్షేమ కార్యాలయంలో వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డిని అభినందించారు. దీంతో ఆశ్రమం వాసులు, సంస్థ ఆత్మీయులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలులో ముందంజలో యూనియన్ బ్యాంకు

● 193మందికి రూ.31.50లక్షల పీఎం స్వానిధి నిధులు
● డ్వాక్రా సంఘాలకు రూ.1.5కోట్ల రుణాల పంపిణీ



మెగా చెక్కును అందిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్ఎం లక్ష్మీతులసి

ఎర్రగుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో యూనియన్ బ్యాంకు ముందంజలో ఉందని ఆ బ్యాంకు కడప రీజినల్ హెడ్ లక్ష్మీతులసి తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్ల యూనియన్ బ్యాంకులో వీధి విక్రయదారులు 193మందికి రూ.31.50 లక్షలు, స్వయం సహాయక సంఘాలకు రూ.1.50కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు రుణాలను మహిళలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. బ్యాంక్ ద్వారా తక్కువ ప్రీమియం ద్వారా గల ఇన్సూరెన్స్ పతకాలైన పీఎం సురక్షా బీమా, పీఎం జీవనజ్యోతి, బీమా ఇన్సూరెన్స్‌అటల్ పెన్షన్ పథకాల గురించి తెలిపారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులేకుండా సత్వర చర్యలు తీసుకుంటూ వారికి అన్ని విధాలా సహకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పుల్లయ్య, బ్యాంకు మేనేజర్ సురేంద్ర, ఫీల్డ్‌ఆఫీసర్ శరత్, మెప్మా అధికారుల, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ముద్దనూరు రోడ్డు స్వప్నానందులో నివాసం ఉంటున్న అంకిరెడ్డిపల్లె రామదాసు(38) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి అలవాటు పడ్డ రామదాసు తరచూ భార్య చంద్రకళతో గొడవ పడేవాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. తరచూ గొడవపడుతుండడంతో కలత చెందిన భార్య ఇద్దరు కుమారులతో కలిసి గురువారం పుట్టింటికి వెళ్లింది. అదేరోజు రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రామదాసు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఇంటివద్దకు వెళ్లగా తలుపులు వేసివున్నాయి. ఎంత పిలిపిచినా పలకకపోవడంతో తలుపులు తెరచి చూడగా రామదాసు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోడ కూలి మహిళ మృతి

సీకేదిన్నె, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గోడకూలి గాయాలపాలైన కొట్లూరి శివమ్మ (52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. మండలంలోని కొప్పర్తి పంచాయతీ హరీంద్రనగర్‌కు చెందిన కొట్లూరు శివమ్మ ఉదయం 7 గంటల సమయంలో గోడకు తగిలించిన చొక్కాలో డబ్బులు తీసుకుని వస్తుండగా ప్రమాదవశాత్తు గోడ విరిగి శివమ్మ, ఆమె అత్త నారాయణమ్మపై పడడంతో ఇరువురికీ గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శివమ్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

వల్లూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె గ్రామ శివారులోని ముళ్లపొదల్లో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ పెద్ద ఓబన్న దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.12600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండల పరిధిలో ఎక్కడైనా చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తన పంపిణీ ఆకస్మిక తనిఖీ

వీరపునాయునిపల్లె, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.పాలగిరి గ్రామంలో ప్రభుత్వం సబ్సిడీతో అందించే శనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకుడు చంద్రా నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్సిడీలో అందించే శనగ విత్తనాల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్యామ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కడపరైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ హమాలి వర్కర్స్‌యూనియన్ ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికులు జెండా ఆవిష్కరణ, కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూని యన్ అధ్యక్షుడు బాదుల్లా,నాయకులుచిన్న ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య,సూరి,సుబ్బరాం పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే అంతిమ లక్ష్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక కార్మికసంఘం ఏఐటీయూసీ అని ఆ యూని యన్ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ కొనియాడారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో శుక్ర వారం స్థానిక ఎర్రముక్కపల్లె సర్కిల్‌లో ఏఐటీ యూసీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్ర మంలో ఏపీ ఆశా వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, శాంతమ్మ, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

జీఓనెంబర్ 36ను ఉపసంహరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పాస్ తప్పనిసరి చేస్తూ విడుదల చేసిన జీఓ నెంబర్ 36ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడపనగరం ఎస్‌టీయు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2010 కంటే ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ అర్హత అవసరం లేదన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, బాలగంగారెడ్డి, రామమోహన్ పాల్గొన్నారు.

పటేల్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎస్పీ


నివాళి అర్పిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పటేల్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. ఏక్తాదివస్‌ను పురస్కరించుకుని జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించిన పరుగును ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఎస్‌టీ డీఎస్పీ సుధాకర్, ఏఆర్‌డీఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్‌పీ వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, శ్రీశైలరెడ్డి, నగరంలోని సీఐలు, ఎస్‌ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు చెప్పడంతోనే సరి...పరిష్కారం అయ్యేదెప్పుడు..?

కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి

పులివెందుల రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలో తమ వార్డుల్లో ఉన్న సమస్యలు చెప్పడంతోనే సరిపోతోందని, అవి పరిష్కారం అయ్యేదెప్పుడు అని పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయి, కుక్కలు, కోతుల వల్ల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని మూడు సమావేశాల్లో చెబుతూనేఉన్నాం ఇప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. అలాగే బ్రాహ్మణపల్లెలో డోర్‌నెంబర్ల సమస్య నేటికి పరిష్కారం కాలేదని ఆ వార్డు కౌన్సిలర్ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. అసలు మీరు చేయగలరా లేదా అని రెవిన్యూ అధికారులను ప్రశ్నించారు. అలాగే గతంలో పాడా కింద చేసిన రోడ్డు పనులకు సంబంధించి బిల్లులురాలేదు, వాటి పరిస్థితి ఏంటి ఇంత వరకు చేసిన పనులకు బిల్లులు ఎలా చేయాలని కౌన్సిలర్ వెంకటరమణ అన్నారు. దీనిపై మున్సిపల్ డీఈ సురేష్ స్పందిస్తూ అప్పటి వరకు చేసిన పనికి ఎంబుక్ రికార్డు చేసి ఉంటే తప్పకుండా ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం పాడా లేదు కాబట్టి మిగిలిన పనిని ఎలాపూర్తిచేయాలని ప్రశ్నించగా, ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని డీఈ తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా సమావేశంలో కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలకు త్వరలో పరిష్కారం చూపుతామని ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, వైస్‌చైర్మన్-2 హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ రాముడు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయోత్సవ సభను దిగ్విజయం చేయండి

కడప మారుతీనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధించిన సందర్భంగా డిసెంబరు 4వ తేదీ విజయవాడ జింఖానా మైదానంలో తలపెట్టిన విజయోత్సవ సభను దిగ్విజయం చేసేందుకు జిల్లాలోని మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. ఆ మేరకు శుక్రవారం హరిత హోటల్ గోడ పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకుడు గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాసరచన పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కడపనగరం జ్ఞానవిహార్ పాఠశాలలో రైల్వే డీఎస్పీ హర్షిత ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశ్యంతో రైలు ప్రయాణం అత్యంత సురక్షితం అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐలు సునీల్‌కుమార్‌రెడ్డి, విజయనరసింహులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.


వల్లభాయ్‌పటేల్‌కు ఘన నివాళి

కడప నాగరాజుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం ఆర్కే కరీం సేవా సమితి ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా పించనర్ల సంఘం కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పించనర్ల సంఘం కోశాధికారి నగేష్, టీడీపీమైనార్టీ నాయకుడు అమానుల్లా, ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, ఆటోబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిటి పెన్నిధి ఇందిరా గాంధీ

కడప కలెక్టరేట్,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ పేదల పాలిట పెన్నిధి అని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌసపీర్ కొనియాడారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. నగరంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాతరిమ్స్‌లోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసరి శ్రీనివాసులు, అబ్దుల్ గఫార్, అంజన్‌కుమార్,రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు















తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధపెట్టండి

ఎర్రగుంట్ల/కొండాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సరఫరా చేసే తాగునీటితోపాటు వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎర్రగుంట్ల, కొండాపురం మండలాల్లో ఆమె పర్యటించారు. ఎర్రగుంట్ల మండలం చిలమకూరులోని జీఎల్ ఎస్ఆర్‌ను సందర్శించి తాగునీటి నాణ్యతాప్రమాణాలను ఆమె స్వయంగా పరిశీలించారు. వర్షాల కారణంగా అన్ని గ్రామాల్లో రోగాలు వ్యాపించకుండా బ్లీచింగ్ చల్లంచి దోమలు వ్యాప్తికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో డీఎల్‌డీవో రామాంజనేయులు, ఎంపీడీవో వెంకటరమణయ్య పాల్గొన్నారు. కాగా కొండాపురం పట్టణంలో జడ్పీ సీఈవో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఎంపీడీవో నాగప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సోలార్ సంస్థ సహకరించాలి

కొండాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వరంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు మండలంలోని టి.కోడూరు గ్రామాభివృద్ధికి సహకరించాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి సోలార్ సంస్థ ప్రకటించిన రూ.25లక్షల విరాళంలో రూ.10 లక్షలను సోలార్ సంస్థ తరుపున శుక్రవారం ఆయన గ్రామ, ఆలయ కమిటీకీ అందజేశారు. సోలార్ సంస్థ వల్ల భూములు కోల్పోయి, అర్హత ఉన్నవారికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసు కుంటామన్నారు. కూటమి ఇన్ చార్జి శివనారా యణరెడ్డి, ఎంపీటీసీ రామమునిరెడ్డి, సోలార్‌సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో శారద సేవలు మరువలేనివి

కాశినాయన అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పబ్లిక్ హెల్త్ నర్సుగా ఎం.శారద అందించిన సేవ లు ప్రశంసనీయమని మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్ప పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లి క్ హెల్త్ నర్సుగా పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది శారద దంపతులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

చాపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్ ఉద్యోగం చేస్తున్నా షేక్ మహ్మద్ హుస్సేన్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగగా ఎంపీపీ లక్షుమయ్య, ఎంపీడీవో రాధాక్రిష్ణవేణి, వీరకిశోర్, తహసీల్దార్లు రామకుమారి, నరేంద్రవర్మ, ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, ఇతర అధికారులు మహ్మద్‌హుస్సేన్‌ను శాలువలతో ఘనంగా సన్మానించారు.

పదోన్నతిపై మైలవరం వైద్యాధికారి బదిలీ

మైలవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మైలవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పృధ్వీరాజ్ తిరుపతి ఎస్వీ ఎంఎస్ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మైలవరం, వద్దిరాల డాక్టర్లు లక్ష్మిప్రసన్న, హుస్సేన్, ప్రవీణ్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సభలో డాక్టర్లు పృధ్వీరాజ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, డీపీఎంవో నారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ముద్దనూరు అక్టోబరు31(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉప్పలూరు, కొలవలి గ్రామ సచివాలయాల పరిధిలోని రైతులకు శుక్రవారం యూరియా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతులకు 2 బస్తాల యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.బయోమెట్రిక్ పద్ధతి ద్వారా పంపిణీచేస్తున్నట్లు వ్యవసాయాధికారులు సూచించిన పరిమాణం మేరకు వాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసి ఎమ్మెల్యే పుట్టా

మైదుకూరు రూరల్,అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) :ఏపీఎస్‌డీసీఎల్ నూతన సీఎండీగా నియమితులైన లోతేటి శివశంకర్‌ను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ శుక్రవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. శివశంకర్‌కు, పుట్టా శాలువ కప్పి,పుష్పగుచ్ఛం అందించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) :మండల అభివృద్ధికి అధికారుల సహకరించాలని మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మం డల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలపై ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల స్థాయి అధికారులు, ఏపీవో రవీంద్రరెడ్డి, రంగసముద్రం పచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఇసుక కుంభకోణంలో మమ్మల్ని బలి చేశారు'

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అర్బన్ హౌసింగ్ ఇసుక కుంభకోణంలో ఏఈని కాపాడటానికి అధికారులు తమను బలిపశువులను చేశారని వర్క్‌ఇన్‌స్పెక్టర్లు కుమారి, ఇందిరలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి అప్పటి ఏఈ వెంకటేశ్వర్లు ఇసుక కోసం ఇండెంట్ పెట్టేవారన్నారు. ఇసుక కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరిపి 10 వేల టన్నుల ఇసుక కొరత ఉందని తేల్చిందని దీంతో తమతోపాటు ఏఈని సస్పెండ్ చేశారన్నారు. ఆ తర్వాత ఏఈ పైరవీల ద్వారా ఉద్యోగంలో చేరారన్నారు. విజిలెన్స్ నివేదిక మేరకు తమపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపనున్నారని, ఇప్పటికైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఉన్నతాధికారులను వారు కోరారు.

రేకలకుంట రహదారి సర్వే

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజరు పంచాయతీ రేకలకుంట గ్రామం నుంచి బ్రహ్మంగారిమఠానికి ఏర్పాటుచేయనున్న రహదారిని డీఈహరినాథ్ నేతృత్వంలో ఇంజనీరింగ్ బృందం శుక్రవారం సర్వే చేపట్టారు. త్వరలోనే రోడ్‌మ్యాప్‌ను ఎమ్మెల్యేకు అందిస్తా మని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ సుబ్బారావు, కాణాల మల్లిఖార్జునరెడ్డి, రామాంజనేయులు. పుట్టాల శివ, వెంకటేశ్, ఓబయ్య పాల్గొన్నారు.

అమరవీరులకు జోహార్లు

పోరుమామిళ్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసినటువంటి పోలీసు అమరవీరులకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి జోహార్లు అంటూ నివాళు లర్పించారు. శుక్రవారం సాయంత్రం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, మాజీ ఆర్మీ సైనికులు, ఉద్యోగులు యువకులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించక ఇక్కట్లు



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలలుగా ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించక ఇక్కట్లు పెడుతున్నాడని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు రాఘవ పేర్కొన్నారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాతకు కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ గత మూడు నెలలు కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి జీతాలు ఇవ్వలే దన్నారు. ఈ నెల కాంట్రాక్టర్ మారారని పాత బకాయిలుతో సహా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి యూనియన్ అధ్యక్షుడు రత్తమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు, కోశాధికారి మహేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

జమ్మలమడుగు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీసు, విద్యార్థులతో 3కే రన్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రన్నింగ్, జాగింగ్ చేయడం వలన ఆరోగ్యానికి మంచిదని, డీఎస్పీ సూచించారు. సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, హైమావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పక్కాగా నిర్వహించాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) :గ్రామస్థాయిలో భూసర్వే పక్కాగా నిర్వహించాలని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో వీఆర్వోలతో సమావేశానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ కలెక్టరు శిరీషా హాజరయ్యారు. ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలో భూ ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి సర్వే పక్కాగా నిర్వహంచాలన్నారు.


తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

బద్వేలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటలకు బీమా, ఇన్సూరెన్స్ అందజేయాలని లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు. పార్టీ నేతలు పాల్గొన్నారు.

చాపాడులో: వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, తహసీల్దారు రామకుమారికి రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, రైతులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు వినతి పత్రంలో కోరారు.

పాత బకాయిలపై దృష్టి సారించండి

దువ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిలపై దృష్టి సారించాలని డీఎల్‌సీవో సత్యానందం ఆదేశించారు. శుక్రవారం అధ్యక్షుడు పోలు రామాంజనేయరెడ్డి, సీఈవో రామమోహన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ దువ్వూరు, కానగూడూరులో గోడౌన్లు ఉన్న నేపథ్యంలో రైతుల వద్ద ధాన్యం నిలువ ఉంచే ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమావేశంలో తెలిపారు. స్థానిక బంగ్లాలో సొసైటీ బ్యాంకు నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు.









ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ సౌధ వద్ద రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు హరి, శివాలయం సెంటర్‌లో శివారెడ్డి, సివిల్‌సప్లై గోడౌన్ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి గురవయ్యలు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1920లో శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ముంబైలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు.

